# హంసలను వేటాడొద్దు [2]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [2]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: మార్చి 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=2020

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# 2

అయితే తనకు కోల్కా ఉన్నాడు.

“స్వచ్ఛమైన కళ్లతో పెరుగుతోన్న కుర్రాడు నీకున్నాడు, టీనా. వాడివి ఎంత స్వచ్ఛమైన కళ్లో!”

“స్వచ్ఛమైన కళ్లంట, స్వచ్ఛమైన కళ్లు,” హోరిటీనా నసపెట్టింది (అతడిని ఎప్పుడూ నసపెడుతుంది. గ్రామ సోవియట్ అధికారి వాళ్లిద్దరినీ భార్యా, భర్తలుగా ప్రకటించిన మరుక్షణంనుంచి ఆమె నస మొదలుపెట్టింది). “స్వచ్ఛమైన కళ్లవాళ్లు ఒకందుకే పనికి వస్తారు: వాళ్లు ట్రాక్టరు ఉపయోగించటానికి బదులు నాగలితో దున్నుతారు.”

“అలాగని ఎందుకంటావు? అటువంటిదేమీ లేదు.”

కోల్కా సంతోషంగా, దయగలవాడిగా ఎదుగుతున్నాడు. అతడికి తనకన్నా పెద్ద పిల్లలంటే ఇష్టం. కళ్లల్లోకి చూసి, చిరునవ్వు నవ్వుతాడు – ఏం చెప్పినా నమ్ముతాడు. ఎంతటి అబద్ధాలు చెప్పినా వెంటనే నమ్మేస్తాడు. ఆశ్చర్యంతో కళ్లు రెపరెపలార్చి, “ఔనా?” అంటాడు.

ఆ “ఔనా?” అనటంలోనే హృదయనైర్మల్యం ఉంది, అవసరమైతే సగం రష్యాకి అది సరిపోతుంది. అయితే అప్పటికి హృదయనైర్మల్యానికి అంత గిరాకి ఉన్నట్టు లేదు, గిరాకి ఉన్నది వేరే వాటికి.

“కోల్కా, ఇక్కడ ఏం చేస్తున్నావు? మీ నాన్నని లారీ గుద్దేసింది, పేగులన్నీ బయటకు వచ్చేశాయి!”

“ఆఁ!...”

కోల్కా ఏడుస్తూ పడుతూ, లేస్తూ పరిగెత్తుకెళ్ళేవాడు. మగవాళ్లందరూ నవ్వుతూ ఉండేవాళ్లు.

“ఏయ్! ఎక్కడికి? మీ నాన్న బతికే ఉన్నాడు. నిన్ను ఆటపట్టించటానికి అలా చెప్పాం, అంతే,” అనేవాళ్లు.

అంతా బాగుందన్న ఆనందంలో కోల్కా కోపం తెచ్చుకోవటం కూడా మరిచిపోయేవాడు. లారీ వాళ్ల నాన్నను గుద్దలేదని, అతడి పేగులు ఉండాల్సిన చోటే, పొట్టలోనే ఉన్నాయని ఎంతో సంతోషపడేవాడు. అందుకే అతను అందరికంటే బిగ్గరగా, హృదయాంతరాళాల్లోంచి నవ్వేవాడు.

అయితే మొత్తంమీద అతను ఒక మామూలు పిల్లాడే. కొండ అంచు మీదనుంచి నదిలోకి దూకేవాడు. అడవిలో దారితప్పేవాడు కాదు, భయపడేవాడు కూడా కాదు. అన్నిటికంటే భయంకరమైన కుక్కను కూడా రెండు మూడు మాటల్తో మచ్చిక చేసుకునేవాడు, వాటి చెవులను తన ఇష్టం వచ్చినట్టు లాగేవాడు. నురగలు కక్కే కాపలా కుక్క కూడా అతని కాళ్ల దగ్గర కుక్కపిల్ల మాదిరి కుయ్, కుయ్ మనేది. అది పిల్లలకు ఆశ్చర్యంగా ఉండేది. "వాళ్ల నాన్నకు కుక్కల భాష తెలుసు," అని పెద్దవాళ్లు వివరణ ఇచ్చేవాళ్లు.

దీంట్లో కొంత సత్యం లేకపోలేదు: యెగర్‌ను కూడా కుక్కలు ఏమీ చేసేవి కావు.

కోల్కాకి సహనం కూడా ఎక్కువ. ఒకసారి అతడు చెట్టుమీదనుంచి పడిపోయాడు (కింద పడిన పిట్టగూడును తిరిగి పైన పెడుతుండగా అతడి కాళ్ల కింది కొమ్మ విరిగిపోయింది.) ఆ పడటం, పడటం అతడి కాలు మెలి తిరిగిపోయింది. దానిని సరిచేసి, తల నుంచి కాళ్ల దాకా అయొడిన్ పూసి, పక్కల కుట్లువేశారు – అంతసేపు అతడు కేవలం మూలుగుతూ నొప్పిని భరించాడు. డాక్టరు కూడా ఆశ్చర్యపోయింది.

"నీ కొడుకు చాలా మొండివాడు!" ఆమె అన్నది.

కాని, కాలు అంతా నయమైన తరువాత యెగార్ పెరడులో పనిచేసుకుంటూ ఉండగా కొట్టంలో కోల్కా ఏడవటం వినిపించింది (చెల్లి పుట్టినప్పటినుంచి అతడు కొట్టంలో పడుకుంటున్నాడు. చెల్లెలి గొంతు అచ్చం వాళ్ల అమ్మలాగా ఎంత పెద్దదో). యెగార్ లోపలికి తొంగి చూశాడు. కోల్కా బోర్లా పడుకుని ఉన్నాడు, ఏడుపుతో అతడి భుజాలు ఎగిసెగసి పడుతున్నాయి.

"ఓయ్, ఏమయ్యింది?"

కన్నీటి చారికలతో ఉన్నముఖాన్ని కోల్కా పైకెత్తాడు: అతడి పెదాలు వణుకుతున్నాయి.

"అంకాస్..."

"ఆ?"

"అంకాస్‌ని చంపేశారు. అతడి వెన్నులోకి కత్తిని దించారు. అలా వెనక నుంచి ఎలా పొడుస్తారు నాన్నా?" "అం... అంకాస్ ఎవరు?"

"మొహికన్ ఆదివాసీ తెగలో చివరివాడు. అతడొక్కడే మిగిలి ఉన్నాడు నాన్నా!..."

ఆ రాత్రి తండ్రీ, కొడుకులిద్దరూ నిద్ర పోలేదు. కొట్టంలో అటూ, ఇటూ తిరుగుతూ కోల్కా కవిత రాయటానికి ప్రయత్నిస్తున్నాడు.

"అంకాస్ శత్రువుని వేటాడుతున్నాడు, యుద్ధానికి సన్నద్ధం అవుతున్నాడు, అతడితో బాహాబాహీ తలపడుతున్నాడు..."

ఆ తరువాత చరణాలు ఏమీ తోచటంలేదు, కానీ కోల్కా మాత్రం విడిచిపెట్టలేదు. కట్టెలకీ, మంచానికి మధ్యనున్న ఇరుకైన దారిలో చేతులూపుతూ, రకరకాల పదాలను పలుకుతూ అటూ, ఇటూ పచార్లు చేస్తున్నాడు. చెక్క తలుపుకి అవతలవైపున ఉన్న పందిపిల్ల ఏం జరుగుతోందో తెలియక గుర్ర్‌మంది.

ఆ సమయంలో ముతక కాలికో చొక్కా, పొడవాటి చెడ్డీలో యెగార్ వంటింటిలో కూర్చొని పెదాలు కదిలిస్తూ రెడ్ ఇండియన్ల గురించి చదువుతున్నాడు. పేర్లు కొత్తగా ఉన్నప్పటికీ చెట్ల గుసగుసలు పరిచయమైనవిలాగానే ఉన్నాయి, తెప్ప కిందనుంచి దూకే చేపలు అవే, తేనీటి కోసం గొడ్డలితో చెక్క పేళ్లు వేయటం రెండు చోట్లా తేలిక ఏమీ కాదు. దానితో యెగార్‌కి ఆ కథ దూరంగా ఎక్కడో అమెరికాలో కాక రష్యాలోనే జరుగుతున్నట్టుంది. కథని మరింత ఆసక్తికరంగా మలచటానికి వింత, వింత పేర్లన్నీ పెట్టారంతే. వరండాలోంచి చల్లగాలి కొడుతోంది. తిమ్మిరిపోయిన పాదాలను కదిలిస్తూ, చేతివేలితో ప్రతి వరసనీ అనుసరిస్తూ ఎంతో కష్టపడి ఆ పుస్తకాన్ని చదివాడు. అంత పెద్ద పుస్తకం అతడు అప్పటిదాకా చదవలేదు. దానిని పూర్తి చేయటానికి కొన్ని రోజులు పట్టింది. కోల్కాతో అన్నాడు, "మంచి పుస్తకం."

కోల్కా అనుమానంగా ముక్కు ఎగబీల్చాడు, దాంతో యెగార్ వివరణ ఇచ్చాడు, "మంచి మనుషుల గురించి."

ఒక రకంగా చెప్పాలంటే కోల్కాకి ఊరికే కన్నీళ్లు వచ్చేస్తాయి. ఇతరుల కష్టాలు, ఆడవాళ్ల పాటలు, పుస్తకాలు– జాలితో అతడికి ఏడుపొచ్చేస్తుంది. అయితే తన కన్నీళ్లకు సిగ్గుపడేవాడు కాబట్టి ఎవరూ చూడకుండా ఏడ్వటానికి ప్రయత్నించేవాడు.

కానీ అతడి అన్న ఓవా – వాళ్లిద్దరికీ మధ్య ఒక్క ఏడాదే తేడా – అవమానానికి మాత్రమే ఏడ్చేవాడు. వళ్లంతా కదిలిపోయేటట్టు విపరీతంగా ఏడ్చేవాడు. అంతేకాదు ప్రతిదానినీ అవమానంగా భావించేవాడు. ఒక్కొక్కసారి ఏ కారణమూ లేకుండానే అవమానానికి గురయ్యేవాడు.

పుస్తకాలు చదవటం ఓవా ఇష్టపడేవాడుకాదు: సినిమాలకి అతడికి డబ్బులిచ్చేవాళ్లు. అతడికి సినిమాలంటే ఎంతో ఇష్టం, గూఢచారులకు సంబంధించిన సినిమాలైతే మూడు, లేదా ఇంకా ఎక్కువసార్లు చూసేవాడు. ఆ సినిమాల గురించి కోల్కాకి చెప్పేవాడు.

"అప్పుడతడిని కొట్టేవాడు – డిష్యుం, డిష్యుం! దాంతో వాడి పని సఫా!"

"అబ్బా, నొప్పిగా ఉండదూ!" కోల్కా నిర్ఘాంతపోయేవాడు.

"ఆడంగి! వాళ్లు గూఢచారులు!"

ఓవా కల గురించి కూడా చెప్పుకోవాలి. ఉదాహరణకు కోల్కాకి రోజుకొక కొత్త కల ఉండేది, కానీ ఓవాకి ప్రతిరోజూ ఒకటే కల: "అందరినీ నిద్రపుచ్చే మంత్రం నాకు దొరికితేనా! నా సామిరంగ, అప్పుడు ప్రతి ఒక్కరినుంచి ఒక రూబుల్ తీసుకుంటాను."

"ఒకటే రూబుల్ ఎందుకని?"

"అలాగైతే ఎవరూ గమనించరు. ప్రతి ఒక్కరినుంచి ఒక రూబుల్ – అంటే... వావ్! ఎంతవుతుందో తెలుసా? రెండువేల రూబుళ్లన్నా అవుతాయని పందెం."

కోల్కా వద్ద ఎప్పుడూ డబ్బులు ఉండవు కాబట్టి అతడి ఆలోచనలు దాని చుట్టూ ఉండేవి కావు. కాబట్టి అతడి కలలు కూడా డబ్బులతో సంబంధం లేనివే అయి ఉండేవి: జంతువుల గురించి, ప్రయాణాల గురించి, విశ్వాంతరాళాల గురించి. అవి తేలికైన కలలు, ఎటువంటి భారం లేని కలలు.

"నిజమైన ఏనుగును చూడటం ఎంత బాగుంటుందో! మాస్కోలో ప్రతి రోజు ఉదయం బజారులో ఏనుగు ఊరేగింపును చూడవచ్చంట."

"డబ్బులేకుండానే?"

"అది బజారులోనేగా ఊరేగేది."

"అంతా అబద్ధం. ఊరికే ఏమీ రాదు."

ఓవా ఏది మాట్లాడినా అతడి తండ్రి ఫ్యోడార్ ఇపటొవిచ్ మాదిరి చాలా అధికారికంగా మాట్లాడేవాడు. తండ్రి మాదిరే అతడికి కూడా వంకర చూపు ఉండేది. అది ఒక ప్రత్యేకమైన వంకర చూపు: బుర్యానోవ్ వంకర చూపు. దీనికి ఫ్యోడార్ ఇపటొవిచ్ ఎంతో మురుసుకునేవాడు.

"ఓవా, ప్రతిదానిని లోపలికంటా చూడాలి. పైకి కనిపించేదంతా అబద్ధం."

ప్రతిదానిని లోపలికంటా చూడటానికి ఓవా ప్రయత్నించేవాడు. కానీ కోల్కా మాత్రం ఏంచేసినా అన్నని అంటిపెట్టుకునే తిరిగేవాడు. అతడితో వాదించేవాడు కాదు, అతడితో పోట్లాడేవాడు కాదు, అలాగని అతడు చెప్పేదంతా వినేవాడూ కాదు. ఎప్పుడైనా ఓవా మరీ అతిగా చేస్తుంటే అక్కడినుండి వెళ్లిపోయేవాడు. ఒకటి మాత్రం కోల్కా సహించలేకపోయేవాడు: తన తండ్రి యెగార్ పొలుష్కిన్‌ని ఓవా పరాచికాలాడితే అస్సలు భరించలేకపోయేవాడు. ఒక్కొక్కసారి ఇది చాలా దూరం వెళ్లేది, కానీ వాళ్లు వెంటనే రాజీ పడిపోయేవాళ్లు – ఎంతైనా రక్తసంబంధీకులు కదా.

మాస్కో వీధుల్లో ప్రతి రోజూ ఉదయం ఏనుగు ఊరేగే విషయం కోల్కాకి వాళ్ల నాన్న చెప్పాడు. అతడికి ఆ విషయం ఎలా తెలిసిందో మరి – వాళ్లింట్లో టీవీ లేదు, యెగార్ దినపత్రికలు చదివేవాడుకాదు. పూర్తి విశ్వాసంతో తండ్రి చెప్పాడు కాబట్టి కోల్కాకి ఎటువంటి అనుమానం లేదు. నాన్న చెప్పాడంటే, అది నిజమన్న మాటే.

వాస్తవానికి వాళ్లు ఏనుగును బొమ్మలలో మాత్రమే చూశారు, ఒక్కసారి సినిమాలో చూశారు. ఆ సినిమాలో సర్కస్ ఉంది, అందులో ఒక ఏనుగు ఒంటికాలు మీద నుంచుని, తమాషాగా ముందుకు ఒంగి, చెవులను ఆడించింది. ఆ తరువాత వాళ్లు ఏనుగుల గురించి రోజుల తరబడి మాట్లాడుకున్నారు.

"తెలివైన జంతువు!"

"నాన్నా, దానిని భారతదేశంలో దున్నటానికి ఉపయోగిస్తారా?"

"లేదు." భారతదేశంలో ఏనుగులు ఏం చేస్తాయో నిజానికి యెగార్ కి కూడా తెలియదు. కాబట్టి తన ఊహకు తట్టినదేదో చెప్పాడు, "అది చాలా బలమైన జంతువు, నాగలి నేలలోంచి బయటకు వచ్చేస్తుంది." "మరి అక్కడ దానితో ఏం చేస్తారు?"

"ఏం చేస్తారా? అన్ని రకాల బరువైన పనులు చేయించుతారు. ఉదాహరణకు చెట్లు పడవెయ్యటం." "మనకి కూడా ఇక్కడ ఒక ఏనుగు ఉంటే బాగుంటుంది కదా, నాన్నా? చక్కగా దుంగలు, కోసిన పలకలను పేర్చుతుంది."

"అవుననుకో, కానీ అది చాలా గడ్డి తింటుంది. దానికి కావలసినంత గడ్డిని మనం నిల్వ చేయలేం."

"మరి భారతదేశంలో ఏం చేస్తారు?"

"ఏం చేస్తారంటే, ఎలాగో గడ్డి సమకూర్చుకుంటారు. వాళ్లకి ఎండాకాలం చాలా ఎక్కువ: గడ్డి కోసి కుప్పలు వేస్తారు."

"అయితే అక్కడ చలి బూట్ల అవసరం ఉండదు కదా, నాన్నా? అక్కడ చాలా బాగుంటుందనుకుంటా!"

"ఆ విషయం నాకు తెలియదు. కానీ ఇక్కడ ఇంకా బాగుంటుంది. ఎందుకంటే ఇది రష్యా. అన్నింటిలోకి మంచి దేశం."

"చాలా, చాలా మంచి దేశమా?"

"చాలా మంచి దేశం, కొడుకా. దీని గురించి ప్రపంచమంతా పాటలు పాడతారు."

"అంటే మనం సంతోషంగా ఉన్నాం కదా, నాన్నా?"

"ఇసుమంతైనా సందేహం వద్దు. మనం సంతోషంగా ఉన్నాం."

కోల్కాకి ఎటువంటి అనుమానం లేదు: నాన్న చెప్పాడంటే, అది నిజమన్న మాటే. ప్రత్యేకించి యెగార్ కూడా ఈ విషయాన్ని హృదయపూర్వకంగా నమ్మాడు. యెగార్ దేనినైనా హృదయపూర్వకంగా నమ్మాడంటే దాని గురించి ఎంతో ప్రత్యేకంగా మాట్లాడేవాడు. ఒకసారి అలా నమ్మినదాని గురించి ఇక అభిప్రాయం మార్చుకునేవాడుకాదు. అటువంటి దానిగురించి ఫ్యొడార్ ఇపటొవిచ్‌తో కూడా గట్టిగా వాదించేవాడు.

"నువ్వు మూర్ఖుడివి, యెగార్. ఊరికే ఏదో వాగుతూ ఉంటావు. నీ వంటిమీద చొక్కా ఏమిటది? ఆఁ?" "నీలం రంగుది."

"నీలం రంగుదా! అంతటి చెత్త బట్ట మరొకటి లేదు: మూడవ ఉతుక్కి అది ఇల్లు తుడవటానికి కూడా పనికి రాదు. నా చొక్కా చూడు, దిగుమతి చేసుకున్నది. ఉతికి, విదిల్చి ఆరేస్తే చాలు — ఇస్త్రీ కూడా అవసరం లేకుండా కొత్తదాని మల్లె ఉంటుంది."

"ఇది నాకు బాగానే ఉంది. ఒంటికి చక్కగా హత్తుకుంటుంది."

"ఒంటికి దగ్గరగా ఉంటుందా! నీ చొక్కా చేపలు పట్టుకోటానికి బాగుంటుంది: అది నీ వంటిని కప్పేది తక్కువ, గాలికి వదిలేది ఎక్కువ."

"ఫ్యోడార్ ఇపటొవిచ్, చీకట్లో నీ చొక్కా విప్పేటప్పుడు దానినుంచి చిటపటలు వస్తాయో, రావో చెప్పు?"

"అయితే?"

"చూశావా! నీ చొక్కా విదేశీ సరుకు. అది ఎంత చెడ్డదంటే దాని నుంచి విద్యుత్తు పుడుతుంది. నా చొక్కా నుంచి ఎటువంటి చిటపటలు రావు చూడు. ఎందుకంటే అదీ, నేనూ ఒకటే; అది నా వంటిని హత్తుకుంటుంది."

"నువ్వు అసమర్ధుడివి, యెగార్. ఒకే ఒక్క మాట: అసమర్ధుడివి! ప్రకృతి నీకు అన్యాయం చేసింది."

"అహ్, ఆఁ... అలాగే ఉందనుకుంటా..." యెగార్ నవ్వేసేవాడు. పిరికిగా మందహాసం చేసేవాడు. కానీ కోల్కాకి కోపం వచ్చేది. పెద్దవాళ్ల సమక్షంలో వాదనకు దిగటం తన తండ్రికే అవమానం అని ఊరుకుంటాడుగానీ అతడికి బాగా కోపం వచ్చేది. వాళ్లిద్దరే ఉన్నప్పుడు మాత్రం తండ్రిని తప్పుపట్టేవాడు: "నువ్వు ఏమీ మాట్లాడకుండా ఊరుకుంటావేమిటి, నాన్నా? అతడు ఇష్టం వచ్చినట్టు వదురుతుంటాడు. నువ్వేమో ఏమీ మాట్లాడకుండా ఉండిపోతావు."

"గిల్లికజ్జాలు పెట్టుకునేవాళ్లను నిద్ర కరుణించదు, కోల్కా. వాళ్లు ఆదమరిచి నిద్రపోలేరు. బక్కచిక్కిపోతారు. ఇది వాస్తవం, కొడుకా."

"వాళ్లకి అరుగుదల సరిగా లేక బక్కచిక్కిపోతారు!" కోల్కా కోపంగా బదులిచ్చాడు.

యెగార్ అబద్ధం చెప్పాడు కాబట్టి అతడికి కోపం వచ్చింది. అబద్ధాలు చెప్పటం, కళ్లు కిందకి దించెయ్యటం: కోల్కాకి అది ఇష్టం ఉండదు. తన తండ్రి అలా జాలిగొలుపుతూ ఉండటం

అతడికి ఇష్టం లేదు. తండ్రిని చూసి కోల్కా సిగ్గుపడుతున్నాడని, బాధపడుతున్నాడని యెగార్‌కి తెలుసు, ఆ కారణంగా యెగార్ కూడా బాధపడేవాడు.

"అహ్, ఆఁ... అలాగే ఉందనుకుంటా..."

ఈ బాధ, ఈ సిగ్గు, భార్య అరుపులు, చుట్టుపక్కల వాళ్ల నవ్వులు – వీటన్నింటికి మూలం ఒక్కటే, అది యెగార్ పని. ఈ కొత్త చోట యెగార్ పని సరిగ్గా చేయలేకపోతున్నాడు – ఉన్నట్టుండి అతడిమీద మంత్రం ఏదో ప్రయోగించినట్టు, అతడి చేతులు చచ్చుపడిపోయినట్టు, ఇంద్రియాలు ఎటోవెళ్లిపోయినట్టు. యెగార్ పగలూ, రాత్రి దానిగురించే మథనపడేవాడు, నలతగా ఉండేవాడు, రాత్రిపూట జగడాలమారి ఫ్యొడార్ ఇపటొవిచ్ కంటే కలత నిద్రపోయేవాడు.

"అవును, నీకు ఎవరైనా దారి చూపాలి, యెగార్, దారి చూపాలి!"

అయితే కోల్కా ఉన్నాడు. తనలాంటి కోల్కా ఇంకెవరికీ లేదు. స్వచ్ఛమైన కళ్ల చిన్నారి యువకుడు!...

*(తరువాయి భాగం వచ్చేవారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige
.com